# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **గుజరాత్‌లోని అహ్మదాబాద్- భుజ్ పట్టణాల మధ్య రాకపోకలు సాగించనున్న దేశంలోనే తొలి వందే మెట్రో రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ప్రారంభించనున్నారు.**
2. **విజయవాడ నగరంలో వరద ప్రభావం తగ్గిందని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**
3. **రాష్ట్రంలో పంటల బీమా పథకానికి విధివిధానాలు రూపొందించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**
5. **ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే వైద్య సేవల పట్ల ప్రజల్లో విశ్వాసం పెంచుతున్నామని ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

==========================

దేశంలోనే తొలి వందే మెట్రో సర్వీసును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ప్రారంభించనున్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్- భుజ్ పట్టణాల మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. రెండ్రోజుల గుజరాత్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి వందే మెట్రో రైలును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తారు. అహ్మదాబాద్- భుజ్ నగరాల మధ్య 9 స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది. 360 కిలోమీటర్ల దూరాన్ని 5 గంటల 45 నిమిషాల్లోనే చేరుకుంటుంది.

-------------------------

విజయవాడ నగరంలో వరద నీరు దాదాపు తగ్గిందని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు. నగరంలోని కండ్రిక, బోస్ నగర్, జర్నలిస్టు కాలనీల్లో నిన్న ఆయన పర్యటించారు. వరద నీరు ఉన్న ప్రాంతాలతోపాటు, పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్న చిన్న చిన్న రోడ్లపై ఆయనే స్వయంగా ద్విచక్రవాహనం నడుపుకొంటూ వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విజయవాడలో పలు ప్రాంతాల్లోకి మళ్లీ బుడమేరు వరద వస్తుందని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని స్పష్టంచేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని నారాయణ సూచిస్తూ..

..వాయిస్..27 సెకన్లు

---------------------------

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 20వ తేదీన సచివాలయంలో జరగనుంది. ఆ రోజు సాయంకాలం 4 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇందులో చర్చించనున్నారు. రాష్ట్రంలో వరదలు, కేంద్ర ప్రభుత్వ సాయంపై సమావేశంలో ప్రస్తావించనున్నారు. హైడ్రా పని విధానం–దీని చట్టబద్ధతకు ఆర్డినెన్స్ తీసుకొచ్చే అంశం, వెనుకబడిన వర్గాల రిజర్వేషన్, కులగణన, 200 పంచాయతీల ఏర్పాటు, రుణమాఫీ, రైతుభరోసాపైనా చర్చించే అవకాశం ఉంది.

---------------------------

రాష్ట్రంలో పంటల బీమా పథకానికి విధివిధానాలు రూపొందించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 20వ తేదీన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం జరగనున్న నేపథ్యంలో నిన్న ఆయన సచివాలయంలో పంటల బీమాపై సమీక్ష నిర్వహించారు. ఈ పథకం అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, రైతుల ప్రయోజనాలకు అనుకూల విధానాలపై చర్చించారు. పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై మంత్రి హర్షం వ్యక్తంచేశారు. తమ వినతిపై స్పందించి సానుకూలంగా నిర్ణయం తీసుకొన్నారని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి మండ్లిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో జరిగిన ప్రమాదంలో 8 మంది మృతి చెందగా 33 మంది గాయపడ్డారని... బాధిత కుటుంబాలకు, గాయపడినవారికి ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇస్తామని మంత్రి వివరిస్తూ...

... వాయిస్...30 సెకన్లు

---------------------------

హైదరాబాద్ నగర పరిధిలో ఈ నెల 17వ తేదీన జరిగే వినాయక నిమజ్జనాల కోసం హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ.. జీహెచ్ఎంసీ పటిష్ఠ ఏర్పాట్లు చేసింది. హుస్సేన్ సాగర్ వద్ద రద్దీని తగ్గించేందుకు నగరంలోని కీలకమైన చెరువులతోపాటు ప్రధాన ప్రాంతాల్లో పరిశుభ్రమైన నీటి కుంటలను సిద్ధం చేసింది. 24 గంటల పాటు సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ.. విగ్రహాలను ఎప్పటికప్పుడు నిమజ్జనం చేసేలా భారీ క్రేన్లు, వ్యర్థాలను తొలగించేందుకు భారీ వాహనాలను అధికారులు సిద్ధం చేశారు. హైదరాబాద్ మహానగరంలో సుమారు లక్ష విగ్రహాలను నిమజ్జనం చేసే అవకాశం ఉండటంతో.. హుస్సేన్ సాగర్‌తోపాటు జంటనగరాల పరిధిలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు.

---------------------------

ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే వైద్య సేవలు పట్ల ప్రజల్లో విశ్వాసం పెంచుతున్నామని ఆంధ్రప్రదేశ్

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని నిన్న ఆయన సందర్శించారు. అనంతరం పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన చికిత్స విధానాలు, మౌలిక సదుపాయాలు కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టిసారిస్తుందని తెలిపారు. మెరుగైన వైద్య విధానం కోసం 30 సూత్రాల ప్రణాళిక ప్రకారం వైద్య సేవలు అందించేందుకు నిర్దేశ కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ప్రజాస్వామ్య విలువల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ 2007 సంవత్సరంలో ఆమోదించిన తీర్మానం మేరకు ఏటా సెప్టెంబర్ 15వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. అందరికీ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అన్న స్ఫూర్తితో భారత దేశ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోంది. భారత దేశంలో ప్రజాస్వామ్యం గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఒక సందర్భంలో వ్యాఖ్యానిస్తూ ప్రజాస్వామ్యానికి భారత దేశం తల్లి వంటిదని అభివర్ణించారు. ప్రపంచ దేశాలు ప్రస్తుతం ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత దేశం ఒకటిగా అవతరించిందని, దేశంలో ప్రజాస్వామ్య విలువలు పాటిస్తుండడం వల్లే ఈ అభివృద్ధి సాధ్యమవుతోందని నరేంద్ర మోడీ పేర్కొంటూ .....

..వాయిస్...35 సెకన్లు

---------------------------

గల్ఫ్ బాధితుల సమస్యలు తెలుసుకుని సత్వరం పరిష్కరించడానికి హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రత్యేకంగా 'ప్రవాసీ ప్రజావాణి'ని నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారం జరిగే 'ప్రజావాణి'లో భాగంగా ఇది కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే నియోజకవర్గాల శాసనసభ్యులు, ఇతర ముఖ్య నాయకులతో ప్రజాభవన్‌లో నిన్న సమావేశమైన మంత్రి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనానికి సలహా కమిటీ ఏర్పాటుచేయాలని, 2023 డిసెంబరు 7వ తేదీ నుంచి గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల రూపాయలు నష్ట పరిహారం అందజేయాలని ప్రతిపాదించారు.

---------------------------

తెలంగాణలో ఇటీవల వర్షాలు, వరదలతో పంట నష్టపోయినవారికి సాయం త్వరలోనే బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కట్టుకాచారం గ్రామంలో నిన్న ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ.. వరదలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక అంచనాల ప్రకారం 10 వేల కోట్ల రూపాయలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని తెలిపారు. వరదల వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కేంద్ర ప్రభుత్వం సాయం చేసేవరకూ ఆగకుండా రాష్ట్ర స్థాయిలోనే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ప్రతి పోలీసు బెటాలియన్ నుంచి 100 మందికి తర్ఫీదు ఇచ్చి విపత్తు నిర్వహణలో పాల్గొనేలా చేస్తామని మంత్రి వివరించారు.

=====================